## క్లుప్తంగా

### నేడు ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం

**ఐరాల:** ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభిస్తున్నట్లు ఎంఈఓ–2 దామోదర్‌నాయుడు తెలిపారు. మండల వ్యాప్తంగా 7 జెడ్పీ హైస్కూళ్లు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 54 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో 2,742 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వీరందరికీ పాఠ్య పుస్తకాలతోపాటు విద్యాకానుక కింద నోటు పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. బ్యాగులు, యూనిఫామ్, బూట్లు రావాల్సి ఉందని తెలిపారు.

### కాణిపాకంలో రద్దీ

**కాణిపాకం:** స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి దర్శనార్థం భారీగా క్యూకట్టారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు తక్షణం క్యూల్లో భక్తుల ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశారు. కాగా 26,722 మంది భక్తులు వినాయకస్వామివారిని దర్శించుకున్నారని ఆలయాధికారులు పేర్కొన్నారు.

### అరాచకాలను అరికట్టాలి

**చిత్తూరు కార్పొరేషన్:** వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని ఆ శాఖ చిత్తూరు డివిజన్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్ణం, కార్యదర్శి గిరిధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి బుధవారం సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఆదాయానికి వెన్నెముకగా ఉన్న వాణిజ్య పన్నుల శాఖలోని కొంత మంది ఉన్నతాధికారులు సాగించిన అరాచక విధానాల వల్ల శాఖ భ్రష్టు పట్టిందని, ఇష్టారాజ్యంగా రాష్ట్రంలో జిల్లాల పునఃవ్యవస్థీకరణ పేరుతో ప్రభుత్వాన్ని పక్కదారి పట్టించారన్నారు. కొంతమంది ఉన్నతాధికారులు పలు కిందిస్థాయి పోస్టులను రద్దు చేశారని ఆరోపించారు. ప్రభుత్వం విచారణ చేసి న్యాయం చేయాలని వారు కోరారు.

### పాఠ్య పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

**నింద్ర:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో శ్రీధర్‌రాజు బుధవారం పంపిణీ చేశారు. ఎమ్మార్సీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు అందిస్తారని తెలిపారు.

### సీఎం ప్రమాణ స్వీకారం వీక్షణ

**పలమనేరు/పుంగనూరు/గంగవరం/చౌడేపల్లె/కుప్పం:** పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గ కేంద్రాలతో పాటు ఆయా మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని లైవ్‌లో డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రదర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సామాన్య ప్రజలు సైతం సీఎం ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు. అలాగే సంబరాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు, ఆ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

**టీడీపీ, జనసేన సంబరాలు**

**పలమనేరు/పుంగనూరు:** ఆంధ్రప్రదేశ్‌కు నాలుగో సారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన సందర్భం పురస్కరించు కుని బుధవారం స్థానిక టీడీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. పలమనేరు పట్టణంలోని మార్కెట్ కమిటీ వద్ద, పుంగనూరులోని గోకుల్ సర్కిల్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే కేక్ కట్ చేశారు.

# వనం.. రక్షణకు బలం

- నగరవనంలో ఏర్పాట్లు ముమ్మరం
- 3 కి.మీ. కందకాలు తవ్వకం
- సీసీ కెమెరాలు సిద్ధం

**చిత్తూరు కార్పొరేషన్:** అటవీ సంరక్షణకు అధికారులు ఉపక్రమించారు. చిత్తూరు ఈస్ట్ రేంజ్ పరిధిలోని నగరవనంలో రక్షణ పనులు చేస్తున్నారు. మరెక్కడా లేని విధంగా నగరంలో విశాలమైన అటవీ ప్రాంతం ఉంది. ఇందులో పలు రకాల జంతువులు, ఎర్రచందనం చెట్లు, నగరవనం ఉన్నాయి. వీటి సంరక్షణకు అటవీశాఖ పరంగా తీసుకుంటున్న చర్యలు తుదిదశకు చేరుకున్నాయి. అలాగే ఇక్కడ పిల్లల పార్కు, ఎఫ్ఆర్వో కూడా కార్యాలయం ఉంది.

**స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట**

నగరవనంలోని నడకదారి ప్రదేశంలో రోజూ వందలామంది వాకింగ్, జాగింగ్ చేస్తుంటారు. మొత్తం 5 కిలోమీటర్లు చుట్టుకొలతలో వాకర్స్ ఉదయం, సాయంత్రం వస్తున్నారు. ఈ ప్రాంతం వెనుక వైపు శివారు ప్రాంతం ఉండటంతో స్మగ్లర్లు ఎర్రచందనంపై కన్నేశారు. ఉదయం, సాయంత్రం రద్దీగా ఉంటుందనే ఉద్దేశంతో గత సంవత్సరం అర్ధరాత్రి వేళ ద్విచక్ర వాహనంలో వచ్చి లోపల నాలుగు ఎర్రచందనం చెట్లు నరికి, తరలించడానికి స్మగ్లర్లు యత్నించారు. చప్పుడు విన్న సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకోవడంతో స్మగ్లర్లు ఉడాయించారు. ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి నరికేసిన ఎర్రచందనం చెట్లను స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో దీనిపై అటవీ శాఖాధికారులు కేసు నమోదు చేశారు.

**కందకం..సీసీ కెమెరాలు**

అటవీ ప్రాంతం చుట్టూ ఉన్న ప్రహరీగోడ పెద్దగా ఎత్తు లేకపోవడం, వెనుక వైపు శివారు ప్రాంతం కావడంతో రక్షణ చర్యలపై అధికారులు దృష్టి సారించారు. సాధారణంగా ఏనుగుల బారి నుంచి ప్రజల రక్షణకు ఈపీటీ (ఎలిఫెంట్ ప్రూఫ్ ట్రెంచ్) అటవీ ప్రాంతంలో నిర్మిస్తారు. మూడు మీటర్ల ఎత్తు, మూడు మీటర్ల వెడల్పుతో వీటిని నిర్మిస్తారు. ఈ కందకాలు ద్వారా జంతువులు అటవీ ప్రాంతం నుంచి బయటకు వెళ్లకుండా ఉపయోగపడుతుంది. వీటితో పాటు స్మగ్లర్లు లోనికి వచ్చి ఎర్రచందనం తీసుకెళ్లకుండా చెక్ పెట్టేందుకు వీలవుతుంది. నగరవనంలో మార్చిలో రూ.8.07 లక్షలతో హాట్‌స్పాట్‌లలో 3 కిలోమీటర్లు కందకాల తవ్వకం పనులు చేస్తున్నారు. దాదాపు పనులు తుదిదశకు చేరుకున్నాయి.



అటవీశాఖకు వచ్చిన సీసీ కెమెరాలు




ఎర్రచందనం చెట్టుకు ఏర్పాటు చేస్తున్న ట్రాక్ కెమెరా

వీటితో పాటు 14 సీసీ కెమెరాలు, 13 సోలార్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వన్యప్రాణుల కదలికలు, మనుషుల సంచారం పసిగట్టేందుకు ఇదివరకే 4 ట్రాక్ కెమెరాలు బిగించారు.



కందకం



చురుగ్గా చేస్తున్న కందకం పనులు

**రక్షణ చర్యలతో స్మగ్లింగ్‌కు చెక్**



చిత్తూరు ఈస్ట్‌లోని నగరవనం ప్రాంతంలో రక్షణ చర్యలు తీసుకున్నాం. ఈ దిశగా కందకం పనులు వేగంగా చేయిస్తున్నాం. వీటితో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు పనులు చేస్తున్నాం. ఇదివరకే ట్రాక్ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఈ చర్యల వల్ల స్మగ్లింగ్‌కు పూర్తిగా చెక్ పెట్టినట్లేనని భావిస్తున్నాం.
–చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్ఓ

### వరసిద్ధుడికి రూ.1,19,421 విరాళం

**కాణిపాకం:** కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామివారికి బుధవారం పలువురు దాతలు రూ.1,19,421 విరాళం అందజేశారు. ఇందులో అన్నదాన ట్రస్టుకు రూ.1,09,600, గో సంరక్షణ ట్రస్టుకు రూ.2,801, శాశ్వత పూజలు రూ.5వేలు, ఇతర విరాళంగా రూ.2,020 వచ్చినట్లు అధికారులు తెలిపారు. విరాళాలు సమర్పించిన దాతలకు ఆలయాధికారులు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### కణ్ణన్‌కు డీఈఓ అభినందన



డీఈఓ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న స్వామి కణ్ణన్

**చిత్తూరు కలెక్టరేట్:** ప్రభుత్వ బడిలో పనిచేస్తూ ఇటీవల డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయుడు స్వామి కణ్ణన్‌ను డీఈఓ దేవరాజు అభినందించారు. బుధవారం డీఈఓ తన కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ బడిలో పనిచేస్తున్న సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు స్వామికణ్ణన్ డాక్టరేట్ పొందడం అభినందనీయమన్నారు. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాల అంశాలను బోధించడమే కాకుండా తమ విజ్ఞానంతో ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఆయన డీఈఓ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. పలువురు టీచర్లు పాల్గొన్నారు.

### 29న జాతీయ లోక్‌అదాలత్

**నగరి:** ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విష్ణువర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, ఐపీసీ, ఎంసీ, డీఈసీ, ఎస్టీసీ, సీసీ498ఏ కేసులు, ఎన్ఐ యాక్ట్, ఎస్ఈబీ, బ్యాంకు కేసులు, సెకండ్ క్లాస్ కేసులు, అడ్మిషన్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

## పేదలకు వరం 'ఫ్యామిలీ డాక్టర్'

**తవణంపల్లె:** ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరం అని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. బుధవారం మండలంలోని కొండ్రాజుకాలువలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు డాక్టర్ ప్రియాంక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, వృద్ధులకు వైద్యపరీక్షలు చేసి, సూచనలు, సలహాలిచ్చారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. గర్భిణులు తప్పకుండా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



కొండ్రాజుకాలువలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

**ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమం**

ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంగంపల్లెలో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



వెంగంపల్లెలో రోగులను పరీక్షిస్తున్న వినయ్‌కుమార్

## ఆశాజనకంగా వేరుశనగ దిగుబడి



దిగువ మోదలపల్లె వద్ద వేరుశనగ ఒబ్బిడి చేస్తున్న రైతు కూలీలు

**తవణంపల్లె:** రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంట దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. మండలంలోని రబీ సీజన్‌లో రైతులు 70 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. వ్యవసాయాధికారుల సలహాలు– సూచనలను పొందారు. బోర్లు, బావుల నీటితో సాగు చేసిన వేరుశనగ పంట సాగు చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ పంట ఒబ్బిడి చేస్తున్నారు. ఒబ్బిడి చేసిన వేరుశనగ అధిక దిగుబడి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో మళ్లీ వేరుశనగ పంట సాగు చేయాలని రైతులు ఆలోచిస్తున్నారు. రబీలో వేరుశనగ కాయలకు మంచి డిమాండ్ ఉంది. మార్కెట్‌లో కిలో పచ్చి శనగ కాయలు రూ.50 నుంచి రూ.70 వరకు ధర పలుకుతోంది.

## ● ఘనంగా గంగమ్మ జాతర



విశేషాలంకరణలో గంగమ్మ

**తవణంపల్లె:** మండలంలోని ఎగువ తవణంపల్లెలో బుధవారం గంగమ్మ జాతర ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం సత్యమ్మ తల్లికి పెద్ద ఎత్తున మహిళా భక్తులు అంబలి పోశారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకొన్నారు. బుధవారం రాత్రి గంగమ్మ ఊరేగింపులో ఇంటింటా అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, మంగళ హారతులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గంగజాతర భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

### బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



బందారుపల్లెలో నిర్వహిస్తున్న ర్యాలీ

**ఏర్పేడు:** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని ప్రగతి సంస్థ మండల కన్వీనర్లు శిరీష, సుభాష్ చంద్రబోస్ అన్నారు. ప్రపంచ బాలల హక్కుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని బందారుపల్లె, పాయిల్‌సెంటర్ ఎస్టీ కాలనీలో అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇసుకబట్టీలు, దుకాణాలు, అగ్రకులాల వారి ఇళ్లలో చిన్నారులు బాలకార్మికులుగా పనులు చేస్తున్నట్లు ఆరోపించారు. ఎక్కువగా ఎస్టీ కాలనీల్లో పిల్లలు చదువుకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని కోరారు. 18 ఏళ్లలోపు వారిచేత పనులు చేయించడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ ప్రతినిధులు వెంకటేష్, సురేష్, రాజేష్ పాల్గొన్నారు.

### ఎన్‌సీసీ పూర్వ క్యాడెట్ల గుర్రపు స్వారీ



గుర్రపు స్వారీ చేస్తున్న ఎన్‌సీసీ పూర్వ క్యాడెట్లు

**తిరుపతి సిటీ:** తిరుపతి 2ఏ ఆర్మీ రెజిమెంట్‌కు చెందిన ఎన్‌సీసీ పూర్వ క్యాడెట్లు హ్యాక్ రైడ్–2024 పేరుతో బుధవారం తిరుపతి సమీపంలోని అటవీ ప్రాంతంలో గుర్రపు స్వారీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ఎన్‌సీసీ పూర్వ క్యాడెట్ల ఔట్ రీచ్‌లో భాగంగా 15మంది ఎన్‌సీసీ పూర్వ క్యాడెట్లు పాల్గొన్నామన్నారు. తాము ఏ స్థాయిలో ఉన్నా ఎన్‌సీసీ తమకు అందించిన దేశభక్తి, విలువలతో కూడిన క్రమశిక్షణను మరువలేమన్నారు. ఫారెస్ట్‌లో క్రాస్ కంట్రీ జాయ్ రైడ్ చేసేందుకు అధికారుల అనుమతి పొంది గుర్రపు స్వారీ చేశామన్నారు. ఎన్‌సీసీ తిరుపతి విభాగం పూర్వ క్యాడెట్లు, అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా పొన్నెయమ్మ జాతర





సారె సమర్పిస్తున్న సురుటపల్లె ఆలయ ఈఓ, సిబ్బంది, సత్యవేడు: అమ్మవారి ఊరేగింపు

**నాగలాపురం:** మండలంలోని సురుటుపల్లెలో శ్రీపొన్నెయమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. పళ్లికొండేశ్వరస్వామి దేవస్థానం తరఫున కార్యనిర్వాహణాధికారి కె.రామచంద్ర రెడ్డి, అర్చకులు, సిబ్బందితో కలిసి అమ్మవారికి మంగళ వాయిద్యాల నడుమ పట్టు వస్త్రాలతో కూడిన సారె సమర్పించారు. ఏటా జాతరకు శ్రీపళ్లికొండేశ్వరస్వామి ఆలయం నుంచి సారె సమర్పించడం ఆనవాయితీ. అర్చకులు, గ్రామపెద్దలు సంప్రదాయబద్ధంగా సారె స్వీకరించారు. అనంతరం ఆలయంలో జరిగిన పూజల్లో వారు పాల్గొన్నారు.

**సత్యవేడు మండలంలో..**

**సత్యవేడు:** మండలంలోని నరసరాజు అగ్రహారంలో గంగమ్మ జాతర వేడుకగా జరిగింది. మంగళవారం రాత్రి 10గంటలకు ప్రారంభమైన ఊరేగింపు బుధవారం ఉదయం తొమ్మిది గంటల వరకు సాగింది. మహిషాసురమర్ధిని అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. తప్పెట్లు, మేళాలు, బాణాసంచా పేలుళ్ల సందడి నడుమ యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం నడివీధిలో అమ్మవారిని కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారికి ఇంటింటి నుంచి సారె తీసుకువచ్చి సమర్పించారు. గంగమ్మ వెంట గండు దీపం పట్టుకుని భక్తులు నడిచారు. ఇంటింటా కుంభం వేసి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



సత్యవేడు: సారె సమర్పిస్తున్న భక్తులు

## భక్తిప్రపత్తులతో మహా కుంభాభిషేకం

**పిచ్చాటూరు:** మండలంలోని రజానగరంలో నూతనంగా నిర్మించిన శ్రీవిఘ్నేశ్వరాలయ మహా కుంభాభిషేకం బుధవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వేకువజామున 3.30 గంటలకు సంకల్ప బింబ శుద్ధి, రక్షాబంధనం, హోమ పూజలు, మహా పూర్ణాహుతి, గోపూజ, గజపూజ, అష్టపూజ నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు కలశ ఊరేగింపు అనంతరం విమాన గోపుర కలశ కుంభాభిషేకం, మూలవిగ్రహం కుంభాభిషేకం, దీపారాధన, మహా ప్రసాద వినియోగం, 9 గంటలకు గర్భాలయంలో స్వామివారికి మహా అభిషేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

మధ్యాహ్నం అన్నదానం చేశారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు.

# సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు

- ఖరీఫ్‌లో పంటల సాగుకు సన్నద్ధం



పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**సదుం:** ప్రస్తుతం మండలంలో రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. వర్షపాతం ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఖరీఫ్‌లో పంటల సాగుకు సన్నద్ధమై వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌లో మండలంలో 930 హెక్టార్లలో వర్షాధారంపై ఆధారపడి రైతులు వేరుశనగ సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. ఇప్పటికే ఇప్పటికే 1,350 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేశారు. అంతేకాకుండా 60 హెక్టార్లలో కంది, 12 హెక్టార్లలో అనుములు, అలసందలు, మరో 300 హెక్టార్లలో వరి సాగు చేయవచ్చని వ్యవసాయశాఖ అంచనా వేసింది.

**విత్తనశుద్ధి కీలకం**

పంటల సాగులో విత్తనశుద్ధి కీలకం. తగిన జాగ్రత్తలతో విత్తనశుద్ధి చేస్తే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చు. దీనివల్ల మొలకలు బాగా పెరిగి తెగుళ్లను తట్టుకుంటాయి.



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- విత్తనశుద్ధిని అధికారుల సూచనల మేరకు తగిన మోతాదులో చేయాలి.
- విత్తనాలు విత్తిన తర్వాత 25 నుంచి 35 రోజుల లోపు ఆకుపచ్చ తెగులు సోకకుండా కాంటాఫ్ మందు పిచికారీ చేయాలి.
- 90 రోజుల తరువాత బావిస్టన్ పిచికారీ చేస్తే ఆకు బలంగా, దృఢంగా ఏర్పడి మంచి దిగుబడులకు అవకాశం ఉంటుంది.
- విత్తనశుద్ధి చేసేటప్పుడు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

**సూచనలు పాటించండి**



పంటల సాగులో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలు–సూచనలు విధిగా పాటించాలి. మోతాదుకు మించి ఏ పంటకు కూడా ఎరువులు, మందులు వాడరాదు. రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి. విత్తనశుద్ధి విధిగా చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చు.
హరిప్రసాద్, ఏఓ, సదుం.